

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యాన అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం అఫీషియల్ కాలనీ వద్ద వివిఎస్ఆర్ ఇన్‌ఫర్స్, ధైర్యలక్ష్మి టవర్స్ అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న వారికి అవగాహనా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది ఆపద కాలంలో అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా ప్రతిస్పందించాలి, నివారణ చర్యలు తీసుకునేందుకు తగిన సలహాలు సూచనలు డెమో అందించారు. అపార్ట్‌మెంట్‌లో గ్యాస్, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అటువంటి ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్నిమాపక శాఖ అందిస్తున్న సేవలను యంత్ర పరికరాలను సిబ్బంది ఏవిధంగా వినియోగిస్తారో వివరించారు.

మత్స్యకారులపై ఆకస్మిక వాత్సల్యం

- సిఎం షెడ్యూల్‌లో తొలుత మూలపేట పోర్టుకు శంకుస్థాపన
- తర్వాత చోటుచేసుకున్న పలు పరిణామాలు
- బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ శంకుస్థాపనకూ ఏర్పాట్లు
- సిపిఎం లేవనెత్తిన అంశమే కారణమని చర్చ



బుడగట్లపాలెం సముద్ర తీరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మత్స్యకారులపై ప్రభుత్వానికి అకస్మాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చింది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ అంశం చాలాకాలంగా మరుగున పడిపోయింది. మత్స్యకారులు దాదాపుగా ఆ అంశమే మరిచిపోయారు. రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఈనెల 14వ తేదీన ఆ ప్రాంతంలో పర్యటించి ముఖమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారంటూ చేసిన ప్రకటన మత్స్యకారుల్లో చర్చకు దారితీసింది. అదానీకి భూములు అప్పగించడానికి పోర్టు శంకుస్థాపనకు సిఎం వస్తారా?, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ మాటేమిటని సిపిఎం ఈనెల నాలుగో తేదీన నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూటిగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో మత్స్యకారుల్లో వ్యతిరేకత రాకుండా మూలపేట పోర్టుతో పాటు అదే రోజున శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం భావించినట్లుగా తెలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగరమాల ప్రాజెక్టుల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 2020లో నిర్ణయించారు. ఇందుకోసం రూ.365.81 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన డబ్బులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. హార్బర్ నిర్మాణానికి 42 ఎకరాలు అవసరమవుతుందని అధికారులు గుర్తించారు. 2020లోనే భూసేకరణ పూర్తి చేశారు. అదే సంవత్సరం గ్రామంలో పర్యావరణ మదింపు కూడా చేశారు. హార్బర్ నిర్మాణ వ్యవహారాలను ఎపి మారిటైమ్ బోర్డు పర్యవేక్షిస్తోంది. గతేడాది మేలో టెండర్లు పిలిచిన ప్రభుత్వం విజయవాడకు చెందిన విశ్వసముద్ర ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. ఈ ఏడాది మే నాటికి మొదటి దశ పూర్తి చేస్తామని టెండర్లను ఖరారు చేసిన సమయంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగూ పడలేదు.

సిపిఎం లేవనెత్తిన అంశాలే కారణమంటూ ప్రచారం

హార్బర్ నిర్మాణానికి సంబంధించి అన్ని ప్రక్రియలను పూర్తి చేసిన ప్రభుత్వం నిర్మాణం జోలికి మాత్రం వెళ్లలేదు. మరోవైపు అదే సంవత్సరంలో మూలపేట పోర్టు ప్రక్రియను ప్రారంభించి చకచకా అడుగులు వేసింది. పోర్టు నిర్మాణానికి భావనపాడు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు, రైట్స్ సంస్థ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొందడం, ఉప్పు భూముల వినియోగానికి కేంద్ర అనుమతి కోరడం వంటి పనులను చాలా వేగంగా చేసింది. బలవంతంగా భూముల సేకరణ, పోలీసు బందోబస్తు నడుమ స్థానికుల నుంచి వివరాలను తీసుకుంది. భూములను అదానీకి అప్పగించడం కోసమే ప్రభుత్వం హడావుడి చేస్తోందన్న చర్చ అప్పట్లోనే నడిచింది. తాజాగా సిపిఎం ఆ విషయాలను గణాంకాలతో సహా బయటపెట్టింది. అదానీకి కట్టబెట్టనున్న ఆరు వేల ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉప్పు భూములు 2,200 ఎకరాలు, ఈస్ట్‌కోస్ట్ సాల్ట్స్, ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ పేరుతో ఉన్న రెండు వేల ఎకరాలు, సిఆర్‌జెడ్ భూములు 750 ఎకరాలు ఉన్నట్లు వివరించింది. ఈ అంశం మత్స్యకారుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ తీరుపై వారంతా గుర్రుగా ఉన్నారు. పోర్టు నిర్మాణం, అదానీ పైనే తప్ప తమపై ప్రభుత్వానికి ప్రేమ లేదనే అంశం మత్స్యకారుల్లోకి ఇప్పటికే వెళ్లిపోయింది. దీంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా సిఎం షెడ్యూల్‌లో తొలుత లేని బుడగట్లపాలెం శంకుస్థాపన అంశాన్ని ప్రభుత్వం తర్వాత చేర్చిందనే ప్రచారం మత్స్యకారుల్లో సాగుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

పోర్టును అదానీకి కట్టబెట్టేందుకు సిద్ధం

- బిజెపితో పోటీ పడుతున్న వైసిపి ప్రభుత్వం
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - టెక్కలి

మూలపేట పోర్టు పేరుతో ఆరు వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షణ్ముఖరావు విమర్శించారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. దేశ సంపదను అదానీకి కట్టబెట్టడంలో మోడీతో జగన్ పోటీ పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికే కృష్ణపట్నం గంగవరం పోర్టుతో పాటు హైడ్రో పవర్ ప్రాజెక్టులను అదానీకి ఇచ్చేశారని చెప్పారు.

మూలపేట పోర్టుకు 580 ఎకరాలను మాత్రమే సేకరిస్తామని ప్రజలకు చెప్పిన ప్రభుత్వం, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సోషియో ఎకానమీ సర్వే పత్రాల్లో 1010 ఎకరాలు సేకరిస్తున్నామని పేర్కొందని తెలిపారు. అధికారులతో ప్రభుత్వం అబద్ధాలు చెప్పిస్తోందన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ ఉప్పు భూములు 2,200 ఎకరాలు, సిఆర్‌జెడ్ భూములు 750 ఎకరాలు, తంపర భూములు 1500 ఎకరాలు, ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ భూములు 2,020 ఎకరాలు మొత్తం కలిపి 6,470 ఎకరాలకు పైగా కట్టబెట్టేందుకు సిద్ధమవుతోందన్నారు.

ప్రభుత్వం అదానీ కోసం ఉందో, మత్స్యకారుల కోసం ఉందో మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పాలని డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణంతో ఆరు మండలాల్లోని వేలాది ఎకరాలు ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణానికి, రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుంటే టిడిపి వైఖరి ఏమిటో ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. భావనపాడు ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు హెచ్.ఈశ్వరరావు, పాలిన సాంబమూర్తి, బగాది వాసు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

టిడిపి సెల్ఫీ రాజకీయాలు

- అభివృద్ధి దగ్గర ఫొటోలు దిగి మీకు పంపిస్తాం
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే తెలుగుదేశం పార్టీ సెల్ఫీ రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. మండలంలోని కిడిసింగి శారదాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ పలాసలో రూ.50 కోట్లతో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి వద్ద సెల్ఫీ దిగగలవా అని చంద్రబాబుకు సవాల్ విసిరారు. రూ.700 కోట్లతో నిర్మాణం చేపడుతున్న శుద్ధిజల ప్లాంట్ వద్ద సెల్ఫీ తీసుకోడానికి చంద్రబాబు రావాలన్నారు. వజ్రపుకొత్తూరు-కాశీబుగ్గ డబుల్ రోడ్డు, టెక్కలిపట్నం-నువ్వలరేవు డబుల్ రోడ్డుపై సెల్ఫీ దిగడానికి వస్తారా అని సవాల్ విసిరారు. టిడిపి చేస్తున్న సెల్ఫీ రాజకీయాలు విడనాడి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. వైసిపి పాలనలో ప్రతి కుటుంబానికీ మంచి జరుగుతుందన్నారు. నాడు-నేడు కింద పాఠశాలలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయని చెప్పారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన సిఎం జగన్ పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యానాయుడు, మాజీ ఎంపిటిసిలు నర్తు ప్రేమ్‌కుమార్, ఇరోతు హేమంతరాజు, మాజీ సర్పంచ్‌లు నర్తు శేషయ్య, కె.గిరిబాబు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ 'స్పందన' రద్దు

శ్రీకాకుళం : జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీన రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన నిమిత్తం జిల్లా పోలీసు అధికారులు సోమవారం నుంచి సిఎం పర్యటన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తులో పాల్గొనున్నారని పేర్కొన్నారు. స్పందన రద్దు విషయాన్ని ప్రజలు గమనించాలని, వ్యయప్రయాసలకోర్చి జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని తెలిపారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లు పరిశీలన

నౌపడ : మూలపేట పోర్టు శంకుస్థాపనకు మూలపేట, నౌపడలో ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి ఆదివారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు, వివిఐపి వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, ప్రోటోకాల్ తదితర అంశాలపై ఎస్‌పిని అడిగి తెలుసుకున్నారు. విష్ణుచక్రంలో నిర్మితమవుతున్న పైలాన్, నిర్వాసితులతో సిఎం సమావేశ ప్రాంగణం, మూలపేటలో సిద్ధం చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ప్రజలు ఒక్కసారిగా హెలీప్యాడ్ వద్దకు చేరుకోకుండా కట్టుదిట్టంగా బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిఐపి వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ అంతరాయం లేకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎం.ఎన్ మణికంఠ, డిఎస్‌పిలు శివరాంరెడ్డి, ఎస్.బాలరాజు, టెక్కలి సిఐ చంద్రమౌళి, ఎస్ఐలు ఉన్నారు.



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఐజి హరికృష్ణ, ఎస్‌పి రాధిక

అశ్రునయనాలతో 'కణితి' అంత్యక్రియలు

ప్రజాశక్తి - పలాస



మాజీ ఎంపీ కణితి విశ్వనాథం అంత్యక్రియలు అశ్రు నయనాలతో అధికార లాంఛనాల నడుమ ఆదివారం నిర్వహించారు. విశ్వనాథం భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు పలు పార్టీల నాయకులు, ప్రజలు, ఆయన అభిమానులు బారులు తీరారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, బిజెపి నాయకులు పి.వి.ఎన్ మాధవ్, పైడి వేణుగోపాలం, లయన్స్ క్లబ్ సభ్యులు తెప్పల కృష్ణమూర్తి తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆయన భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో స్థానిక హిందూ శ్మశానవాటికకు తరలించారు. పోలీసులు అధికార లాంఛనాలతో వందనం చేస్తూ గాల్లోకి కాల్పులు జరిపారు. విశ్వనాథం కుమారుడు రాజేంద్ర ఆయన చితికి నిప్పంటించారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, తహశీల్దార్ మధుసూదనరావు, సిఐ శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వైసిపి నాయకులు భవానీ, డాక్టర్ శాంతారావు, దుర్గాప్రసాద్ పాత్రో, బిజెపి జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కొర్ల కన్నారావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పకడ్బందీగా పీపుల్స్ సర్వే

జెసిఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త హర్షవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకమని, దేశంలో ఎక్కడా లేనివిధంగా చేపడుతున్న పీపుల్స్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెసిఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త హర్షవర్ధన్ రెడ్డి సూచించారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల జెసిఎస్ సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. పార్టీ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు అవసరమైన కిట్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ప్రజా సమస్యలు ఉంటే స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా అందిస్తున్న జగన్మోహనరెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. జెసిఎస్ సమన్వయకర్తలు, గృహ సారథుల సారథ్యంలోనే 2024 ఎన్నికలకు వెళ్తున్నామని చెప్పారు. పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే వారికి భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈనెల 19న ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, గుళ్లపల్లి గణేష్, జలుమూరు ఎంపిపి వాన గోపి, రెండు జిల్లాల నుంచి 56 మంది జెసిఎస్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్ రెడ్డి

నేటి నుంచి స్వేచ్ఛావతి ఉత్సవాలు

- నెల రోజుల పాటు నిర్వహణ
- సంబరాలకు ముస్తాబైన ఇచ్ఛాపురం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పదేళ్లకోసారి నిర్వహించే గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు ఇచ్ఛాపురం ముస్తాబైంది. నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సంబరాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంలోని అన్ని వీధుల్లో సుమారు 50 మండపాలను సినిమా సెట్‌ల మాదిరిగా సిద్ధం చేశారు. సోమవారం రాత్రి 11.55 గంటలకు అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం ఉప్పలవీధిలో ఉత్సవ మండపం వద్ద అమ్మవారిని కొలువుదీరుస్తారు. అక్కడ్నుంచి ప్రతిరోజూ రోజుకో వార్డు చొప్పున తిరువీధి నిర్వహిస్తారు. సంబరాల చివరి రోజున స్వేచ్ఛావతి అమ్మవారిని ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేస్తారు.

స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలను 1977లో తొలిసారిగా నిర్వహించారు. ఆ తర్వాత 24 ఏళ్ల పాటు నిర్వహించలేకపోయారు. తిరిగి 2001లో నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత 2013లో నిర్వహించగా పదేళ్ల తర్వాత సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇచ్ఛాపురం ప్రవేశం నుంచి ఒడిశా సరిహద్దు వరకు రూ.40 లక్షలతో విద్యుద్దీపాలంకరణ చేశారు. బస్టాండ కూడలి వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి గేట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంబరాల్లో భాగంగా కళారూపాలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



సంబరాల ఏర్పాట్లు పరిశీలన

సంబరాల ఏర్పాట్లను కాశీబుగ్గ డిఎస్‌పి శివరాంరెడ్డి ఆదివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. వలంటీర్లకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్‌కు, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఎస్ఐ గోవిందరావును ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డిఎస్‌పిని సత్కరించారు. ఉత్సవాలకు విశాఖపట్నం నుంచి అనేక మంది వచ్చే అవకాశమున్నందున అదనపు బస్సులు నడపాలని ఆర్‌టిసి ఇడి, పలాస డిపో మేనేజర్‌కు సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు.

'క్యాట్'లో మెరిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని పాత ఆమదాలవలసకు చెందిన బొడ్డేపల్లి శ్రీనివాస్ క్యాట్‌లో అత్యధిక మార్కులు సాధించి మెరిశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ (ఐఐఎంఎ)లో నిర్వహించిన క్యాట్ పరీక్షలో 99.74 మార్కులు సాధించారు. బొడ్డేపల్లి రాజగోపాల్, పద్మజ పెద్ద కుమారుడు శ్రీనివాస్. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు డిఎవి పబ్లిక్ స్కూల్ పాలకొండలో, 9 నుంచి పదో తరగతి వరకు కెకెఆర్ గౌతమ్ స్కూల్ విజయవాడలో, ఇంటర్మీడియట్ చక్రభవన్ శ్రీచైతన్య విజయవాడ బిటెక్ ఐఐటి బిహెచ్.వి వారణాసి ఎంబిఎ ఐ ఐ ఎ ం అహ్మదాబాద్ లో అడ్మిషన్ పొందారు. శ్రీనివాస్ తండ్రి బొడ్డేపల్లి రాజగోపాల్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొత్తూరులో, తల్లి పద్మజ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పాలకొండలో విధులు నిర్వహిస్తున్నారు.



బొడ్డేపల్లి శ్రీనివాస్

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి తీవ్రత వల్ల శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి వడదెబ్బకి గురవుతారని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. వడదెబ్బ వల్ల ఒక్కోసారి మరణాలూ సంభవించవచ్చని చెప్పారు. వాటిపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. తద్వారా మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం (హైపో థలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురవుతారని తెలిపారు. దీన్నే 'హీట్ స్ట్రోక్' లేదా 'సన్ స్ట్రోక్' (వడదెబ్బ) అంటారని చెప్పారు. ఇది అత్యంత ప్రమాదకరమని, ప్రాణాంతకమని వివరించారు. వడదెబ్బకు గురైన వారిలో చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం వడదెబ్బ తగలడానికి గల కారణాలని చెప్పారు. 65 ఏళ్లు పైబడిన వారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, గుండెజబ్బులు, అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా గొడుగు వాడడం, తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం, తలకు టోపీ, రుమాలు వాడడం, వేడిగాలులు తగలకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనిచేయకుండా ఉండాలని తెలిపారు. శీతల పానీయాలు, మంచు ముక్కలు తీసుకోరాదన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు తాగడం మంచిదన్నారు. రోజులో వీలైనన్ని ఎక్కువసార్లు చల్లని మంచినీరు తాగడం, ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చడం, చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవడం, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేయాలన్నారు. ఫ్యాను గాలి గానీ చల్లని గాలి తగిలేలా ఉంచడంతో పాటు ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం, ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం తాగించడం వంటి పనులు చేపట్టాలన్నారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని, వీలైనంత త్వరగా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు వహించాలని సూచించారు.





రగ్బీ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా జట్టు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రగ్బీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం జిల్లా జట్ల ఎంపిక నిర్వహించారు. ఈనెల 30వ తేదీ నుంచి మే ఒకటో తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలో పాల్గొంటున్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి వారణాసి గోవిందు, పార్వతీశం తెలిపారు. ఒక్కొక్క బృందంలో 12 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలురు బాలికలకు వేర్వేరుగా జట్ల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నామని ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడన నారాయణరావు తెలిపారు. టెక్కలి డిగ్రీ కళాశాల మైదానంలో బాలురకు, పాతపట్నం ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలో బాలికలకు శిక్షణ ఉంటుందని చెప్పారు. .ఎంపికైన జట్లను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి అభినందించారు. ఈ ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కెె.రామిరెడ్డి, సత్య, నాగరాజు, జానకి, సీతయ్య, పూర్ణచంద్రరావు, కాపుల రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు మించిన సంపద లేదు


నృత్యం చేస్తున్న చిన్నారులు

రణస్థలం రూరల్: ప్రపంచంలో విద్యకు మించిన సంపద లేదని డిఇఒ పగడాలమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని కోష్ట సక్సెస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డుకారాదని, కష్టపడి చదివిన వారు రాణించడం ఖాయమన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి అజ్జాడ త్రినాథరావు, రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యానభ్యశించాలని, గొప్ప విద్యావంతులుగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల డైరెక్టర్ కరిమజ్జి రమణ, ప్రిన్సిపాల్ కరిమజ్జి దేవి, మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు, ఎంపిటిసి ప్రతినిధి ఆసిరినాయుడు, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు, మాజీ ఎంపిటిసి పైడి అప్పడుదొర, విఆర్ఒ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి


మాట్లాడుతున్న అమరావతి

కొత్తూరు: కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరావతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆశాలతో మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిఎఫ్ గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఆశాలకు పని భారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.గౌరమ్మ, జ్యోత్స్న, జయలక్ష్మి, మీనా, జి.లక్ష్మి, ఎ.గోవిందరావు, ఎల్.తులసి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న 104 ఎంఎంయులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.నారాయణ, బమ్మిడి లోకనాథం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో 104 జిల్లా మేనేజరు లక్ష్మణరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కొండ ముకుందరావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. 104 ఎంఎంయు ఉద్యోగులందరినీ ఆప్కాస్ పరిధిలో చేర్చాలని, రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని, రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

టెక్కలి రూరల్: టెక్కలి ఇంజినీరింగ్ కళాశాలలో సెకెండ్ ఈఈఈ బిటెక్ విద్యార్థులు 139 మందికి ఈ నెల 11 నుంచి 24 వరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిఎస్ ఎక్సెలెన్స్ ల్యాబ్‌లో 'డేటా యానలిసిస్ యూజింగ్ పైతాన్' అనే అంశంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. సిఎస్ఇ విభాగానికి చెందిన 72 మంది విద్యార్థులకు 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' అనే అంశంపై 10 నుండి 15 వరకు జరిగిన శిక్షణ శనివారంతో ముగిసిందని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థులు ఈ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అధికంగా పొందేలా కృషి చేయాలని కోరారు. ఈ శిక్షణలో ప్రిన్సిపల్ ఎఎస్.శ్రీనివాసరావు, ఈఈఈ హెచ్‌ఒడి కె.కిరణ్‌కుమార్, డాక్టర్ వి.అశోక్‌కుమార్, బ్రాంచ్ కో-ఆర్డినేటర్ అశోక్ గేంగ్, ఎం.వి.వి.చంద్రశేఖర్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

న్యాయవాదులకు నోటీసులు రాజ్యాంగ విరుద్ధం

ఆమదాలవలస: న్యాయవాదులు, మేధావులకు నోటీసులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఎపి సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్ ఆడిటర్ అరెస్టును ఖండిస్తూ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, జడ శ్రావణ్‌కుమార్, ఇతర న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్లు, జర్నలిస్టులకు సిఐడి నోటీసులు పంపడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పే హక్కు ప్రతి పౌరునికీ రాజ్యాంగం కల్పించిందని, ఈ విషయం సిఐడి పోలీసులకు తెలియనిది కాదని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రాథమిక హక్కులను కాపాడాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

కవిటి: మండలంలోని లొల్లపుట్టుగ గ్రామంలో ఆదివారం ఉదయం చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లొల్ల శ్రీను, లొల్ల విజయ్, కింగ్, ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మండలంలోని బూర్జపాడు గ్రామంలోని పంట పొలాలకు వెళ్లేందుకు కాలిబాట వంతెన నిర్మాణానికి జనసేన నేత లొల్ల రాజేష్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో కాలువ దాటుకొని వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారు. కాలిబాట వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే రూ.1.50 లక్షలు అవసరమని అంచనా వేశారు. విషయం తెలుసుకున్న రాజేష్ తన వంతు సహకారం అందించారు. అధికార పార్టీ నేతలు స్పందించి ప్రభుత్వపరంగా వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

20న చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఆమదాలవలస: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా జరుపుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 20వ తేదీ గురువారం పట్టణంలోని ఊసవానిపేట బైపాస్ రోడ్డు వద్ద ఉన్న శారద కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ లెవెల్ కన్వీనర్లు, ఏజెంట్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, తదితరులు విజయవంతం చేయాలని కోరారు.

వీరేశలింగం జయంతి

లావేరు: మురపాక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టంలో భాగంగా తెలుగు కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పూలమాలలేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కందుకూరి గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తుల్లో ఆయనొకరని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం మండలంలోని నందగిరిపేటలో సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో సుమారు 200 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

బిజెపిని ఇంటికి సాగనంపాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే బిజెపిని ఇంటికి సాగనంపాలని సిపిఎం నగర కార్యదర్శి టి.తిరుపతిరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రచార భేరిలోలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని గొంటివీధి, రెడ్డికవీధి, గాజుల వీధిలో, ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో ఆదివారం ఉదయం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోనిబిజెపి ప్రభుత్వం మనందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను, మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వరంగ పరిశ్రమలని, వాడరేవులను, ఆఖరికి మన అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. మోడీ అండదండలతో అదానీ ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టారో హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని తెలిపారు. అయినా ఆదానీపై విచారణకు అంగీకరించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెనకేసుకు వచ్చిందన్నారు. దేశంలోని అడవులు, భూములు, విద్యుత్ ప్రాజెక్టులు, గనులు కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతోందని అన్నారు. భావనపాడు పోర్టును అదానీకి అప్పగించడానికి జగన్ పూనుకున్నారని అన్నారు. గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానికి అప్పగించారని, ఆంధ్రప్రదేశ్‌ను అదానీ ప్రదేశ్‌గా మారుస్తున్నారని విమర్శించారు. గ్యాస్ బండ మనకు గుది బండ అయిపోయిందని, కరెంటు బిల్లులు ముట్టుకుంటేనే సాకులు కొడుతున్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు మన బతుకుల్లో మంటలు రాజేస్తున్నాయని అన్నారు. ఉపాధి హామీని సైతం మోడీ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. విభజన హామీల అమలు గురించి అడిగే ధైర్యం కానీ, నిలదీసే దమ్ము కానీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఎం.గోవర్ధనరావు, జె.సింహాచలం, డోల శంకరావు, ఎం.గోపి, కె.భాస్కరావు, పట్ట ప్రభావతి, నీలవేణి, పి.ప్రసాద్, శ్రీనివాసరావు, టి.నందోడు, కె.అప్పన్న, వై.గోపాలుడు, బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: బిజెపి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం, సిపిఐ నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, అనపాన షణ్ముఖరావు అన్నారు. మండలంలోని రావివలసలో ప్రచార భేరి నిర్వహించారు. వారు మాట్లాడుతూ బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యడ్ల గోపి, యుగంధర్, గోవిందరావు, జనార్ధన, ధర్మారావు, మెట్ట సింహాచలం, కార్మికులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు



ప్రచార భేరిలో వామపక్ష పార్టీల నాయకులు

అరసవల్లికి పెరిగన రద్దీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. చైత్రమాసం చివరి ఆదివారం కావడంతో సందర్శకులు తరలివచ్చారు. దీనివల్ల ఆలయానికి ఒక్క రోజులోనే రూ.6.14 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,71,200, విరాళాల రూపంలో రూ.52,710, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,90,220 ఆదాయం వచ్చిందని వివరించారు. ఆలయ ప్రధాన ద్వారం ముందర యాత్రికుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి నగరంలోని చిన్న బరాటం వీధికి చెందిన లాడె చంద్రశేఖరరావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. చెక్కును ఆలయ ఇఒ హరి సూర్యప్రకాష్‌కు అందజేశారు.

వైభవంగా భువనేశ్వరిదేవి పండగ

ప్రజాశక్తి - పోలాకి

ప్రియాగ్రహారంలో భువనేశ్వరి దేవి పండగ ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. గ్రామస్తులు అమ్మవారికి ముర్రాటలు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బెవర నూకరాజు, ఎంపిటిసి ఎస్.ప్రసాద్‌రావు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు పండగ నిర్వహిస్తున్నామని, 25న అమ్మవారి సిరిమాను ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ప్రతి 11 ఏళ్లకు పండగను అంగరంగవైభంగా నిర్వహిస్తున్నామని, 2012లో పండగ నిర్వహించామని చెప్పారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు ప్రతి రోజూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17న ధూమ్ ధడాఖా, 18న రెల్లివారి పెళ్లి జానపదం, 19న కోలాటం, 20న కోబ్రా డాన్స్, 21న శ్రీకృష్ణ లీలలు, 23న ధూమ్ ధడాఖా, భాగవతం హరికథ, 24న కోలాటం అను బ్రహ్మాండమైన డాన్స్, గయోపాఖ్యానం, 25న సత్యహర్చింద్ర నాటకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామదేవత పండగలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుజ్జల తవిటియ్య, ఎం.అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

టెక్కలి: మండలంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన ఉర్జాన చిన్నారావు తన మూడో కుమార్తె వివాహానికి గ్రామానికి చెందిన రాంబాబు చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.30,500 ఆర్థిక సాయం అందించినట్లు నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు తెలిపారు. చిన్నారావుకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, నిరుపేద కుటుంబం కావడంతో సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గుణాకర్, పెదరట్టి మణి, తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'లో సంతోషం

కవిటి: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని కవిటి ఎంపిపి కడియాల పద్మ అన్నారు. మండలంలోని శిలగాం పంచాయతీ కొర్రాయిపుట్టుగ, దాసరిపుట్టుగ గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ ఆదివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల అనుమతితో వారివారి నివాసాలపై జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, కడియాల బాబురావు, కె.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని మారడికోట, చీడిపాలెం, నాయుడు పోలూరు, తదితర గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మారడికోట సర్పంచ్ ప్రతినిధి పెద్దింటి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో ఇళ్లకు స్టిక్కర్లను అంతించి, బుక్‌లెట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని దిమిలి, రాయల, కాకరగుడా, ఆల్తి గ్రామాల్లో ఆదివారం పాతపట్నం వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగన్ స్టిక్కర్లను అంటించారు. మహిళలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు జనార్ధన, పాల్గుణ, కృష్ణమూర్తి, దారపు రామకృష్ణ, నాగరాజు, ఎ.నాగేశ్వరరావు, వడమ శ్రీను, శ్రీహరి, ఆర్.ఢిల్లీశ్వరరావు, జి.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

టెక్కలి: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గురకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష టెక్కలిలో ప్రశాంతంగా జరిగింది. స్థానిక జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళికి చెందిన 191 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రిన్సిపాల్ ఎ.దామోదరరావు వ్యవహరించారు.

20 నుంచి వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యాశాఖ ఆధ్వర్యాన ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు.పదో తరగతి పరీక్షలు పూర్తికావడంతో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఒంటి పూట బడులు కావడంతో అందరికీ ఉదయం పూట మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో 6 నుంచి 9వ తరగతి వరకు రెండు పూటలు తరగతులు ఉండేవి. తాజాగా విద్యాశాఖ 1 నుంచి 8వ తరగతి వరకు క్లాస్ రూం బేస్డ్ అససెమెంట్(సిబిఎ) పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తున్నారు. 9వ తరగతికి మాత్రం ఎస్ఎ2 పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒఎంఆర్ సీట్లు, ప్రైవేటు స్కూల్ విద్యార్థులకు ప్రశ్నా పత్రం ఇవ్వనున్నారు. 27న ప్రశ్నాపత్రాల మూల్యాంకనం, 28న ప్రమోషన్ జాబితాలు తయారు చేయాలని మార్గదర్శకాలు వచ్చాయి.

వృద్ధురాలికి ఆసరా

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని రాజపురంలో వృద్ధురాలికి అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ అండగా నిలిచింది. స్థానికుల ద్వారా వృద్ధురాలి సమాచారం తెలుసుకున్న అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆదివారం రాజపురం చేరుకుని వైశ్యరాజు సంతోష్‌కుమార్, కీర్తి సాత్విక్, ధనుంజయ రూ.2,500 అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లలితా బిసాయి, సునీత రౌలో, రాజేష్ మజ్జి, గోపికిషన్ బిసాయి, ప్రవీణ్ మజ్జి, రాజు, దినేష్, లిలిత్, వాలంటీరు ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

ఇదే ఆదరణను కొనసాగించండి


విజయకు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కవిటి

తమ కుటుంబసభ్యుల దయనీయస్థితిని గుర్తించి తమకు జీతాలు అందేలా కృషి చేసిన జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ భవిష్యత్‌లో ఇదే ఆదరణ కొనసాగించి, తమ బతుకులకు భరోసా కల్పించాలని ఉద్దానం తాగునీటి పథకం సిబ్బంది కోరారు. ఉద్దానం తాగునీటి పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి బకాయి పడిన 14 నెలల జీతం ఇటీవల అందించారు. దీంతో ఆదివారం ఉదయం బల్లిపుట్టుగలో విజయను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉద్దానం తాగునీటి పథకం జిల్లా ఉపాధ్యక్షుడు బెందాళం రమణమూర్తి మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్, సిపిడబ్ల్యుఎస్ పథకాల్లో పనిచేస్తున్న పంపు ఆపరేటర్లు, వాల్ ఆపరేటర్లు, నైట్ వాచ్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్న 350 మంది ఉద్యోగులకు ముఖ్యమంత్రితో మాట్లాడి అవుట్‌సోర్సింగ్ లేదా, సొంత ఏజెన్సీ కల్పించేలా కృషి చేస్తానని జెడ్‌పి చైర్‌పర్సన్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వారి వినతి మేరకు మిగిలిన బకాయి జీతాలు వీలైనంత తొందరలోనే అందించేందుకు కృషి చేస్తామని విజయ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్దానం తాగునీటి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కరువు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్


రాగులు పంటను పరిశీలిస్తున్న కూన రవికుమార్


ప్రజాశక్తి - బూర్జ

రైతు పండించిన పంటకు కనీస మద్దతుధర కరువైందని, జిల్లాలో మిరప, రాగులు, జొన్న, మినప, పెసర, తదితర పంటలు పండించే రైతులు ఎవరికీ అమ్ముకోవాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. దీనిపై అధికారుల నుంచి ఎటువంటి అవగాహన సదస్సు లేకపోవడంతో రైతులు దుస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. చీడివలస, గంగంపేటలో ఇదేం ఖర్మ మన ప్రభుత్వానికి కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, రైతులకు మద్దతు ధరతో పాటు, పుష్కలంగా మూడు పంటలకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఏ గ్రామం చూసినా రోడ్లు, కాలువలు, పూడికతీత లేక దర్శనమిస్తున్నాయని అన్నారు. కాలువ పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. చీడివలసకు చెందిన కళావతి మాట్లాడుతూ తాను నిరుపేదనని, ఇల్లు ఇవ్వలేదని రవికుమార్ వద్ద వాపోయింది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గృహం మంజూరు చేస్తామని అన్నారు. అనంతరం చీడివలస గ్రామంలో వైసిపి నాయకులు బూరి శ్రీనివాసరావు, కృష్ణ, తదితరులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో నాయకులు బూరి వెంకటరమణ, లంక జగన్నాథంనాయుడు, పిల్ల కన్నమనాయుడు, మేడి ప్రసాద్‌రావు, సర్పంచ్‌లు అంపిలి గణపతిరావు, కె.సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో వైసిపిని అధికారం నుంచి దించేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని అన్నారు. ఆదివారం 14వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు పెరిగాయన్నారు. ధరల పెరుగుదలతో పాటు, పన్నుల భారం కూడా పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్.జానకిరావు, నందిగామ కోటేశ్వరరావు, ఆసి లీలారాణి, కొండ శంకర్‌రెడ్డి, జయదేవ్, జన్నేళ సంతోష్, ఊనా సంతోష్, ఎస్ఎస్ పండా, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడితేనే పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని టెక్కలి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ఎల్.కృష్ణ అన్నారు ఆదివారం సాయంత్రం మండలంలోని లాఖిదాసుపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు ఎం.బాలకృష్ణ, సింహాచలం, లోకనాథం, విశ్వనాథం, తిరుపతిరావు పాల్గొన్నారు.

'జనం కోసం జనసేన'


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

జనం కోసం జనసేన పార్టీ పని చేస్తుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని ఐదో వార్డు పంతులుపేట గ్రామంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను, షణ్ముఖ వ్యూహం, తదితర అంశాలను ప్రజలకు వివరించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కౌలు రైతులకు అండగా నిలబడే అంశాన్ని ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో జనసేన పార్టీని గెలిపిస్తే ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని ప్రజలకు తెలిపారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు పైడి మురళి మోహన్, పట్టణ నాయకులు గంగు కొటేష్, గోద్దు కోటేష్, బగ్గు సురేష్, షణ్ముఖరావు, దువ్వాడ కరుణసాగర్, రాజు, రమణమూర్తి, మోహన్‌రావు, గుండా రమణ, రాజశేఖర్, రాజా, రాము, పవన్, రామారావు, గణేష్, భాను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


ఇచ్ఛాపురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆమదాలవలసలో...

ప్రజాశక్తి - రణస్థలం, రూరల్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తే అగ్ని ప్రమాదానికి దారితీస్తుందని ఫైర్ ఆఫీసర్ పైలా అశోక్ అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీనగర్ కాలనీ అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వంటింటిలో అగ్ని ప్రమాదాలకు దారితీసే అంశాలు, విద్యుత్ సంబంధిత అజాగ్రత్తలతో ఏర్పడే అగ్ని ప్రమాదాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలు, గోదాములు, కర్మాగారాలు, గ్రామీణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలకు దారితీసే అంశాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం అగ్నిప్రమాద నివారణ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.పోలినాయుడు, ఉరిటి రవి, బి.ప్రసాద్ ఎ.రాము, జి.రామ్‌లక్షణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని స్వేచ్ఛావతి అపార్టుమెంట్‌లో మహిళలకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై, గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. లిఫ్ట్‌లో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర వాటిని క్షుణ్ణంగా వివరించి, ప్రాక్టికల్‌గా వారితో చేయించారు. కార్యక్రమంలో ఎఎస్ఎఫ్ఒ ఆర్.సూర్యారావు, కామరాజు, రాంబాబు, భీమారావు, రామకృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పలాస: గృహిణులు వంట చేసేటప్పుడు గ్యాస్ దిమ్మ వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విష్ణు రెసిడెన్సీలోని మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా గ్యాస్ వల్ల అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. వంట పూర్తి అయిన తరువాత రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, యుగంధర్, ప్రేమ్‌కుమార్, మన్మధరావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కర్లేమ్మ పంచాయతీ నేతాజీనగర్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక అధికారి జి.రమణమూర్తి మహిళలకు గ్యాస్ బండ వద్ద ప్రమాదం జరిగితే నివారణ చర్యలపై అవగాహ కల్పించారు. వంట చేసేటప్పుడు తలుపులు, కిటికీలు తీసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి కె.అప్పారావు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం గాజుల కొల్లివలసలో అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి


16 రోజులుగా మృత్యువుతో పోరాడుతూ మృతి


బుడ్డెపు రామకృష్ణ

ప్రజాశక్తి - పొందూరు

మార్చి 31వ తేదీన పొందూరు మండలం బురిడికంచరాంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విజయనగరం జిల్లా రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన బుడ్డెపు రామకృష్ణ(35) శనివారం మృతి చెందాడు. 16 రోజుల పాటు శ్రీకాకుళం రిమ్స్‌లో మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం... పొందూరు మండలం బురిడికంచరాంకు చెందిన గులివిందల అసిరినాయుడు సైనిక పాఠశాలలో పిల్లలకు సీట్లు ఇప్పిస్తానని నమ్మబలికి రామకృష్ణ నుంచి రూ.16 లక్షలు తీసుకున్నాడు. సైనిక పాఠశాలలో సీటు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి తన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ అసిరినాయుడును కోరాడు. ఎన్నిసార్లు అడిగినా ఇదిగో, అదిగో అంటూ తప్పించుకునేవాడు. దీంతో మృతుడు తన భార్య రజనీతో కలిసి గత నెల 31వ తేదీన అసిరినాయుడు స్వగ్రామం బురిడికంచరాం వెళ్లి అడగగా నేను ఇవ్వను ఎవ్వరికి చెప్పుకుంటావో చెప్పుకో అని అనడంతో తన వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణను గ్రామస్తుల సహకారంతో భార్య శ్రీకాకుళంలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించింది. మూడు రోజులకే రూ.3.50లక్షలు ఖర్చు కావడంతో తట్టుకోలేక శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తోంది. శనివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఈనెల 1న పోలీసులు కేసు నమోదు చేశారు. రామకృష్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

తప్పిన పెను ప్రమాదం


నేలకూలిన విద్యుత్ స్తంభం

వజ్రపుకొత్తూరు : మండలంలోని బాతుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం పెద్ద మర్రిచెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడటంతో రెండు విద్యుత్ స్తంభాలు తీగలతో పాటు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో వాహనాలు రాకపోకలు, ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి సిబ్బంది చేరుకొని తగు చర్యలు చేపట్టారు.

అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి


సుశాంత్ మృతదేహం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని పెద్దమడి గిరిజన రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సవర సుశాంత్ ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పాఠశాలకు సమీపంలోని తోటలో విగతజీవిగా పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియరాలేదు. సుశాంత్ మృతి వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలికి చేరుకొని రోధించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న శివ

జి.సిగడాం: రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నట్లు మండల శిక్షణ అధికారి ఎం.శివ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. రైతులకు నవధాన్యాలు ఉపయోగాలను తెలిపారు. మినుములు, పెసలు, కందులు, ఉలవలు, బొబ్బర్లు, తోటకూర, గోంగూర, పాలకూర, కట్టి జనుము, జిలుగు. పిల్లిపెసర, గంటెలు, కొర్రలు, సాములు, అరికలు, చోలు, ఆవాలు, జిలకర్ర, ధనియాలు, బెండ, బీర, కాకర, వంగ, జొన్న, నువ్వులు ఈ విధంగా 30 రకాలైన విత్తనాలు భూమిలో 10-12 కేజీలు వేసి కలియ దున్నటం ద్వారా ఒక్కో మొక్క నుండి ఒక్కో పోషకం ఎలా పెంచాలో శిక్షణ ఇచ్చారు. వీటి ద్వారా భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజేష్, సంతోషి కుమారి, రాజేశ్వరిమ్మ, సింహాద్రి, వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.